# పుట్టింటి ఆశ

హోతా పద్మినీదేవి



**ఎఱ్ఱబడిన ముఖంతో సుడిగాలిలా లోపలకి వచ్చిన సుగుణని చూసి చంద్రం ఆశ్చర్యంగా అడిగాడు.**

"ఏమయింది సుగుణా" రోషంతో ముక్కు పుటాలు, అదురుతుండగా అంది. "అసలేమనుకుంటోంది మీ వదిన? తను బిర్లా కూతురి ననా? ఆవిడ పుట్టింటివాళ్ళు ధనవంతులయితే అవచ్చు. సంక్రాంతి పండుగకి ఆవిడని పిలిచివాళ్ళు గద్వాల్ చీర పెట్టి వుండచ్చు. అంత మాత్రం చేత నన్ను అవమానించే హక్కు ఆవిడకేం వుంది?"

"ఇంతకీ ఏమంటుంది మా వదిన?"

"ఏదైనా అంటుంది, పుట్టింటి దన్ను చూసుకునేగా ఆవిడకా మిడిసిపాటు, నా పుట్టింటి వాళ్ళు మధ్య తరగతి కుటుంబీకులనేగా చులకన?" సుగుణ కళ్ళలో నీళ్ళూరాయి.

"ష్! ఏమిటది చిన్నపిల్లలా? ఆమె స్వభావం తెలిసి కూడా..."

"స్వభావం! అవును తేలుకొండి స్వభావం! నేను కాపురానికి వచ్చినది మొదలు పిల్లి మీద ఎలుక మీద పెట్టి నన్ను ఏదో ఒకటి అంటూనే వుంది. ఇవాళ మొహం మీదే అనేసింది" గాద్గదికమైన స్వరంతో అంది. అసలేం జరిగిందని అతను అడగక ముందే చెప్పింది. "నేను కట్టుకున్న ఈ చీర చాలా బాగుందని

మెచ్చుకుంటూనే ఖరీదు అడిగి మూడు వందలు అని నేను చెప్పగానే మీవాళ్ళు అంత కంటే ఏం పెడతారులే అంది" ఆమె కళ్ళలో మళ్ళీ నీళ్ళూరాయి.

చంద్రానికి వదిన మనస్తత్వం బాగా తెలుసు. పుట్టింటి నుంచి ఆస్తి తెచ్చిందనే అహం ఆమె అణువణువునా నిండి వుంది.

అలాంటి వదిన తన భార్యని హేళన చేసిందంటే అతను ఆశ్చర్య పోలేదు. ఆమెని మనసులోనే ఏవగించుకున్నాడు.

"అయినా మా నాన్న గారిననాలి. పెద్ద సంబంధాలు చెయ్యగానే సరికాదు. వాళ్ళ స్థాయికి తగ్గట్టు ముచ్చట్లు జరపక్కర్లేదా? కనీసం మీ వాళ్ళ ముందు నేను తల ఎత్తుకుని తిరిగేలా కాస్త ఖరీదైన చీర పెట్టవచ్చుగా నాకు? ఏ పండక్కి అయినా నాకు మూడు వందలకి మించి చీర పెట్టారా? పోనీ మీకు? ఆస్తిపరుడు పెద్ద ఉద్యోగంలో వున్న అల్లుడని మీకైనా ఖరీదైన బట్టలు పెట్టారా? ఎప్పుడూ చవకరకం బట్టలే. మీ వదిన హేళన చేసిందంటే చెయ్యదూ? వాళ్ళ నాన్నగారు ఆవిడకి ఖరీదైన చీరలు పెట్టడమే కాదు, బంగారు గాజులో, డైమండ్ రింగ్, ఏదో ఒకటి గిఫ్ట్‌గా ఇస్తూనే వుంటారు." సుగుణ స్వరంలో తోటి కోడలి అదృష్టానికి ఈర్ష్య కంటే తన పుట్టింటి వాళ్ళు ఘనమైన కానుకలివ్వక పోవడం వలన ఆమె ముందు తను పొందిన అవమానం తాలూకు బాధే ఎక్కువ ధ్వనించింది.

"మీ నాన్నగారి పరిస్థితిని బట్టి అయినా నువ్వలా మాట్లాడకూడదు" మెత్తగా మందలించాడు చంద్రం. "అయినా మనకి సంక్రాంతి నుంచి శివరాత్రి దాకా అన్నీ పండుగలే. వాళ్ళ తాహతుకి తగ్గట్టు మనకి మర్యాదలు చేస్తూనే వున్నారు. మా వదిన హేళన చేసిందనీ, ఇరుగు పొరుగు వాళ్ళ మధ్య, గొప్ప కోసమో వాళ్ళ నుంచి ఖరీదైన కానుకలని ఆశించడం తప్పు".

మరో సమయంలో అయితే భర్త మాటలకి ఎలా స్పందించేదో కాని అవమానంతో ప్రజ్వరిల్లుతున్న ఆమె మనసుని అతని మాటలు పెద్దగా కదిలించలేకపోయాయి. "మొగుడు కొట్టినందుకు కాదు తోటి కోడలు దెప్పి నందుకు" అనే సామెతగా పుట్టింటి వాళ్ళు తనకి ఖరీదైన చీర పెట్టనందుకు కాదు ఆమె తన వాళ్ళ లేమిని ఎత్తి చూపించినందుకు ఆమె మనసు బాధావమానాలతో మరిగిపోతోంది.

తన మాటలకి ప్రత్యుత్తరం ఇవ్వని భార్య మూడ్ కనిపెట్టి చంద్రం మౌనంగా వూరకుండిపోయాడు.

సుగుణకి తోటి కోడలి హేళనాపూరితమైన మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి. "ఆమె హేళన చేసిందంటే చెయ్యదూ మరి? తన పెళ్ళయి రెండేళ్ళు. ఈ రెండేళ్ళలోనూ ఏ పండక్కీ ముష్టి మూడు వందలు ఖరీదు చేసే చీర తప్ప నలుగురిలో గొప్పగా చూపించుకునే చీర ఒక్కటైనా పెట్టారా? తన అత్తవారు ధనవంతులు. వాళ్ళ మధ్య తను చిన్నబుచ్చుకోకూడదనే ఇంగితం వుండద్దూ?" అసహనంగా పళ్ళు కొరుక్కుంది.

"ఎలా వున్నావమ్మా సుగుణా?" ఫోన్‌లో అన్నగారి స్వరం విని ముభావంగా అంది.

"బావగారు కులాసానా? ఇంట్లో వున్నారా?"

"ఆయన కేంప్ కెళ్ళారు! ఏమిటి విశేషం?"

"విశేషమే" నవ్వి అన్నాడు.

"మన ఇంటి రిపేర్లు పూర్తయ్యాయి. వచ్చే ఆదివారం పాలు పొంగించి సత్యన్నారాయణ వ్రతం చేసుకుంటున్నాం. నువ్వు బావగారు తప్పక రావాలి. నాన్నగారు మిమ్మల్ని విడిగా పిలుస్తానన్నారు".

"మన బంధువులందరినీ పిలుస్తున్నారా?"

"ఎవరినీ పిలవడం లేదు. ఇంటికి స్లాబు వేసి ఫ్లోరింగ్ చేయించి చిన్న చిన్న రిపేర్లు చేస్తేనే తడిసి మోపెడయింది. బంధువులని పిలిస్తే వాళ్ళకి భోజనాలు పెడితే సరిపోదు. అందరికీ బట్టలు పెట్టకపోయినా ఆడవాళ్ళకి జాకెట్టు గుడ్డలయినా పెట్టాలి. మిమ్మల్ని తప్ప ఎవరినీ పిలవడం లేదు."

"నాక్కూడా జాకెట్టు గుడ్డతో సరిపెట్టేస్తావేమిట్రా?" వేళాకోళంగా అంటున్నట్టు అంది.

"ఛ! అలా ఎందుకు చేస్తాం? నీకు, బావగారికి బట్టలు కొంటానన్నారు నాన్నగారు."

"మీరు కొనద్దు. నాకు బావగారికి నచ్చిన బట్టలు ఇక్కడే కొనుక్కుంటాం. తరువాత మీరు డబ్బు ఇద్దురు గాని"

"సరేలే!"

"మీ పనుల హడావుడిలో పడి బావగారిని పిలవడం మరిచిపోకండి. వుంటాను" ఫోన్ పెట్టేసింది.

"తనకి గద్వాల్ చీర, భర్తకి రేమాండ్స్‌లో మంచి బట్టలు కొనుక్కోవాలి. వాటిని తోటి కోడలికి గర్వంగా చూపించాలి" ఆమె తన మనసులోని ఈ ఆలోచనని భర్తకి చెప్పలేదు. సత్యన్నారాయణ వ్రతానికి తన పుట్టింటి నుంచి ఆహ్వానం వచ్చిందని మాత్రం చెప్పింది.


❀ ❀ ❀

మామిడాకుల తోరణాలతో అలంకరింపబడివున్న ఆ ఇల్లు ఆహూతులతో సందడిగా వుంది. రంగనాథం, శారదమ్మ దంపతులు సత్యన్నారాయణ స్వామి వారి వ్రతం చేస్తున్నారు. సుగుణ వదినెలిద్దరితోబాటు పేరంటాళ్ళకి పసుపు కుంకుమ ఇస్తోంది.

ఖరీదైన పట్టు చీర, ఒంటి నిండా నగలు ధరించి లక్ష్మీ దేవిలా ఇంట్లో

## అందరూ 'అదే' చేస్తుంటే నేనేం చేయను!

'తోబా తోబా'లో శృంగార కోరికలు తీరని టీచర్‌లా నటించి రెచ్చగొట్టిన పాయల్ రోహిత్గీని 'మరీ అంత ఎక్స్‌పోజింగా?' అని కదిపితే "బిపాసా, నేహా, మల్లిక, ఇప్పుడు ప్రియాంక, దియా, దయానా..ఇలా వరుసగా ఒళ్లు దాచుకోకుండా కష్టపడుతుంటే నేను మాత్రం మడికట్టుక్కూర్చుంటే అవకాశాలొస్తాయా చెప్పండి! అందుకే అందరూ చేసేదే నేనూ చేస్తున్నా! నాకన్నా ముందున్నవాళ్ళని ఈ మాట అడిగినట్లయితే బావుండేది" అంటూ సలహా ఇచ్చింది. ముందున్న వాళ్ళనీ అడిగాం. వాళ్ళూ మళ్ళీ నోరెత్తకుండా సమాధానమిచ్చారన్న విషయం అమ్మడికి చెబితే ఏమంటుందో!





## పూలు

పూజా
సుమాలు కొన్ని
వాడి రాలిపోయే గడ్డిపూలు ఎన్నో
సుదతి తలకెక్కే పూలు
పసిపాపలా నవ్వేవి
కన్నెలా పూరించేవి
ప్రౌఢలా కవ్వించేవి
జన్మదినానికీ
పదోన్నతికీ
పదవీ విరమణకీ
విషెస్ చెప్పేవి
పెళ్ళికీ చావుకీ
దండలుగా మారేవి
హరివిల్లులా అలరించేవి
చేదు అనుభవాల్లా
గుండె కోత మిగిల్చేవి
వెన్నెల్లో వేడి రగిల్చేవి
మండుటెండల్లో వెన్నెల కురిపించేవి
జనజీవన స్రవంతి ప్రతి మజిలీలో
పాలు పంచుకునేవి పూలే!

- బద్ది నాగేశ్వరరావు

తిరుగుతున్న కూతురిని, భేషజం లేకుండా బావమరుదులతో కలివిడిగా మాట్లాడుతున్న అల్లుడిని చూసి వాళ్ళ మనసులలో ఆనందం ఉప్పొంగింది.

సుగుణ పట్టుచీరలు, నగలు ధరించి నవ్వుతూ హుషారుగా తిరుగుతున్న వదినలిద్దరినీ చూస్తూ అనుకుంది. "ఇంత పెద్ద ఇంటిని కేవలం గోడలు మాత్రం మిగిల్చి పైన స్లాబు, క్రింద ఫ్లోరింగ్ వేయించడానికి బాగానే ఖర్చయివుంటుంది. వదినల నగలు అమ్మకుండా ఇంత ఖర్చుని ఎలా భరించారబ్బా? అన్నయ్యలిద్దరూ బాగానే సంపాదిస్తూవుండి వుండాలి?"

పుట్టింటి వాళ్ళ ఆర్థిక పరిస్థితి మరీ అంత దిగజారిపోలేదని నిర్ధారణకి వచ్చిందామె. తను నాలుగువేలు ఖరీదు చేసే బట్టలు కొనుక్కుని వాళ్ళపై మోపలేని భారం వేస్తోందేమోనని ఆమె మనసులో ఏమూలో వున్న గిల్టీ ఫీలింగ్ మాయమయింది.

వ్రతం ముగిసింది. ఇరుగు పొరుగులు తాంబూలం, ప్రసాదం తీసుకుని వెళ్ళారు.

"బట్టలు కొనుక్కున్నారామ్మా సుగుణా?" తల్లి అడిగిన ప్రశ్నకి సమాధానంగా తను తెచ్చిన బట్టలతో బాటు వాటి తాలూకు బిల్లు కూడా అందించింది.

ఆ బిల్లు చూసిన శారదమ్మ ముఖం క్షణం వెలవెలబోయినా మరుక్షణం సర్దుకుంది.

"చాలా బాగున్నాయమ్మా! నాన్నగారితో చెప్పి డబ్బు ఇప్పిస్తాను" అంది.

సుగుణ తేలిగ్గా నిట్టూర్చింది.

మామగారు తన చేతిలో తాంబూలంతో బాటు పెట్టిన ఖరీదైన బట్టలని చూసి నివ్వెరపోయిన చంద్రం "ఇదేమిటి మామయ్యా? ఇప్పుడెందుకివన్నీ" అన్నాడు వారిస్తున్నట్టు.

"ఏదో మా ముచ్చట. కాదనకు బాబూ!" అన్నాడు రంగనాథం.

అత్తగారు భార్య చేతుల్లో పెట్టిన ఖరీదైన గద్వాల్ చీరని చూసేప్పటికి చంద్రానికి అర్థమయింది ఆమె తల్లిదండ్రులని అడిగి, ఖరీదైన బట్టలు కొనిపించిందని. అతను చప్పున తల తిప్పి భార్య కళ్ళలోకి లోతుగా చూశాడు. అతని చూపు ఆమెని నిలదీస్తున్నట్టుంది.

సుగుణ చూపు మరల్చుకుంది. తరువాత ఆమె ఒంటరిగా చిక్కినప్పుడు అడిగాడు.

"మీ నాన్నగారిని అడిగి అంత ఖరీదైన బట్టలు కొనిపించావా?"

"అడగలేదు. నీకు నచ్చిన బట్టలు కొని తెచ్చుకో అని మా అన్నయ్య అన్నాడు. అందుకని..."

"మహా తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటున్నావ్ కదూ? వాళ్ళు నీకు నచ్చినవి కొనుక్కోమంటే వేలకి వేలు ఖరీదైన బట్టలు కొనుక్కోమని అర్థమా?"

"మీరు ఊరుకోండి! ఒక్కగా నొక్క ఆడపిల్లని. పైగా స్థితిమంతుల కోడలిని. నా ముద్దు ముచ్చట్లు తీర్చవలసిన అవసరం వాళ్ళకు లేదా? అయినా మా వాళ్ళు మరీ అంత లేనివాళ్ళేమీ కాదు. ఆ మాత్రం పెట్టచ్చు" అంటున్న భార్యని కోపంగా ఒక్క చూపు చూసి వూరుకున్నాడు చంద్రం.

తల్లి తన చేతిలో వుంచిన నాలుగు వేల రూపాయలను చూసి తను తప్పు చేసిందా అనిపించిందామెకి ఒక క్షణం.

"మీ చేత ఇంత డబ్బు ఖర్చు పెట్టిస్తున్నాను. కాని తప్పలేదమ్మా! ప్రతీ పండుగకి మీరు నాకు, మా ఆయనకి చౌకరకం బట్టలు పెడుతుంటే మా తోటి కోడలి ముందు నాకెంత అవమానంగా వుందో తెలుసా? మొన్నటికి మొన్న ఆవిడ ఫెదేల్న ఎంత మాట అనేసిందో, తెలుసా?" అంటూ ఆవిడ అన్న మాటలని యథాతథంగా చెప్పింది.

శారదమ్మ ముఖం మ్లానమయింది. "మీ నాన్నగారి పరిస్థితి నీకు తెలియనిదేమీ కాదు. నీ పెళ్ళికి, మీ అన్నయ్యల చదువులకి అయిన అప్పులని ఆయన మొన్నటిదాకా తీరుస్తూనే వున్నారు. ఇల్లంతా కారిపోతుంటే రిపేరు వేయించవలసి వచ్చింది. మీ పెద్దన్నయ్య బ్యాంక్ లోన్ తీసుకున్నాడు. అన్నయ్యలిద్దరికీ ఇంక నుంచి నెలకి పన్నెండు వందల చొప్పున జీతంలో లోన్ తాలూకు డబ్బు తీరేదాకా కట్ అవుతుంది. మాకు ఒక్కగా నొక్క ఆడపిల్లవి. నీ ముద్దు ముచ్చట్లు తీర్చవలసిన ధర్మం మాకు వుంది. కాని, మా తాహతుకి మించి తేలేము కదా? మీ అన్నయ్యలిద్దరూ ఇద్దరేసి పిల్లలని చదివిస్తూ ఈ సంసారాన్ని బాగానే లాక్కొని వస్తున్నారు. ఇంటికైన అప్పు తీరకుండానే వాళ్ళ పిల్లలు పెళ్ళికి ఎదిగి వస్తారు. ఏం చెయ్యాలో ఏమిటో?" తల్లి స్వరంలోని బాధా వేదనలు ఆమె గుండెని తాకాయి.

అప్పటివరకు భుజాల చుట్టూ కప్పుకున్న పైట కొంగుని తీసి తల్లి ముఖాన్ని తుడుచుకుంటుంటే ఆవిడ మెడలోని పసుపు తాడుని అప్పుడు చూసింది సుగుణ.

"నీ మెడలోని నాను తాడేమయిందమ్మా?"

"సిమెంటు బస్తాలకి తక్కువ అయిందని తాకట్టు పెట్టాం. అనుకున్న దానికంటే చాలా ఖర్చయిపోయింది. అసలు గొలుసు అమ్మెయ్యమనే అన్నాను. మీ అన్నయ్యలు ఇష్టపడలేదు."

"నిన్ను పసుపుతాడుతో వుంచి వదినలు మాత్రం బంగారం దిగేసుకుని వూరేగుతున్నారు" కోపంగా అంది.

"వాళ్ళ బంగారం ఎప్పుడో అమ్మేశాం. వాళ్ళు వేసుకున్నవి రోల్డ్‌గోల్డ్ నగలు".

సుగుణ ముఖాన చన్నీళ్ళు కొట్టినట్టయింది. "బయట అప్పుచేద్దామంటే అసలు కంటే వడ్డీ ఎక్కువయి కూర్చుంటుంది. అందుకని మీ వదినలిద్దరూ ఆలోచించి నగలు అమ్మేశారు. ఇల్లు నిలబెట్టుకోవడం ముఖ్యం. అయినా అవసరాలకి అమ్ముకోడానికేగా ఆడవాళ్ళకి నగలు?"

"అన్నయ్యలిద్దరూ అప్పుల ఊబిలో కూరుకు పోయివుంటే వాళ్ళ నుంచి విలువైన కానుకలని ఆశించిందా తను?" సుగుణకి పట్టరాని దుఃఖం వచ్చింది. తన కన్నీళ్ళు తల్లి కంటబడకుండా గదిలోకి వెళ్ళిపోయింది.

❊ ❊ ❊

గదిలోకి వస్తూనే మంచానికి అడ్డంపడి ఏడుస్తున్న సుగుణని ఏమయిందని ప్రశ్నించాడు చంద్రం.

ఏడుస్తూ వెక్కిళ్ళ మధ్య చెప్పింది. ఆ ఇంటి పరిస్థితిని, అన్నలిద్దరూ అప్పుచేసి ఇల్లు రిపేర్ చేయించిన సంగతి.

మీ వదిన హేళన చేసిందని గొప్పకోసం ఖరీదైన బట్టలు కొన్నానే తప్ప ఇదంతా ఆలోచించలేదు?

"ఇంక సంవత్సరమంతా మనకి ఏవో పండుగలు వస్తూనే వుంటాయి. మీ వాళ్ళు మనని పిలుస్తూనే వుంటారు. మనం రాకపోతే వాళ్ళు బాధపడతారని వస్తూనే వుంటాం. ఇలా ప్రతి పండుగకి వేలకి వేలు ఖరీదు చేసే బట్టలు పెట్టడం వాళ్ళకి తలకి మించిన భారం కాదా? ఆడపిల్లకి పుట్టింటి ఆశ వుండడం సహజమే. కాని అది వాళ్ళని కష్టపెట్టేలా అప్పులపాలు చేసేలా వుండకూడదు".

అల్లుడైనా, కొడుకులా తన వాళ్ళ కష్టాన్ని అర్థం చేసుకున్న భర్త వైపు చూస్తున్న సుగుణ మనసులోని పశ్చాత్తాపం కళ్ళలో వ్యక్తమయింది.

"ఈ డబ్బు అమ్మకి తిరిగి ఇచ్చేస్తాను" అంది.

"వద్దు, బాధ పడతారు" చంద్రం సూట్‌కేసు తెరిచి పదివేల రూపాయలు తీసి ఆమెకి అందించాడు.

"మీ అమ్మగారు తాకట్టు పెట్టిన గొలుసుని విడిపించుకుని వద్దాం పద"

"అమ్మ ఒప్పుకోదు"

"నేను ఒప్పిస్తాను" అని గదిలో నుంచి బయటకి నడిచాడు. సుగుణ తేలికపడిన మనసుతో అతన్ని అనుసరించింది. ❊



# మృగ రాజుకా మత బోధ!

ఈ మతాల పట్టింపుతో మనిషికి ఆధ్యాత్మికత సంగతి ఎలా ఉన్నా దానితో సమస్యలూ ఎదురవుతాయి. మత మార్పిడులు, రివర్స్‌మత మార్పిడులు జరుగుతున్నాయి. మతాల ముసుగులో ఘోరకలి జరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మతం కారణంగానే టెర్రరిజమ్ విజృంభిస్తోంది కదా!

అలాంటి పరిస్థితుల్లో మృగాలకి సయితం మతబోధల్ని వినిపిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చూడండి మరి!

తైవాన్ రాజధాని తైపేలో ఒక జూ ఉంది. దానిలో రెండు భయంకర సింహాలు ఉన్నాయి. అలాంటి వాటి ఎన్‌క్లోజర్‌లోకి ఒక వ్యక్తి దూకేశాడు. చేతులు ఎత్తి "జీసస్ నిన్ను రక్షించుగాక" అని వాటికి బోధించాడు. "రండి నా చేతులు కరవండి" అని వాటికి ఆహ్వానం పలికాడు.

మగ సింహం కోపంతో రెచ్చిపోయింది. ఆ మనిషి జాకెట్ పట్టి పీకింది. అతను ఒక బండమీద పడిపోయాడు. వెంటనే సింహం భుజం పట్టింది. ఇంకా నయం సహజంగా అవి మెడనే పట్టేస్తాయి. కాని అది ఆ పనికి పూనుకోలేదు.



తరువాత దయ దలచి అతని పాంట్‌ని పీకి వదిలిపెట్టింది. ఈ లోగా గార్డులు ప్రవేశించి బలంగా నీటిని చిమ్మి సింహాలని తరిమేశారు. పోలీసులు మత్తు బాణాలతో వాటిని పడగొట్టారు. తరువాత తన చొక్కా అందుకొని గాయపడిన చెన్ అనే ఆ వ్యక్తి గోడదూకి బయటపడ్డాడు. వెంటనే హాస్పిటల్‌కు తీసుకొనిపోయారు అధికార్లు.

కాలిమీద, ముందు, వెనక గాయాలయ్యాయి. 46 ఏళ్ళ వయసుగల ఇతగాడికి మెంటల్ సమస్యలున్నాయిట. దైవాజ్ఞ లభించినందున ఇలా ప్రవర్తించానని అతడు అన్నాడు.

ఇంతకీ ఈ సంఘటనకు ముందే ఆ సింహాలు పుష్కలంగా మాంసాన్ని ఆరగించాయి. అందువల్ల వాటి కడుపులో ఆకలిమంటలు లేవు. అంతో ఇంతో శాంతియుతంగా సాగిపోయింది ఈ సీను. ఇతగాడి మతబోధని అవి తిరస్కరించాయంటారా?

– జమ్మి కోనేటిరావు